
సాక్షి
అనంతపురం
గురువారం । 14 । మార్చి । 2024



చీనీ టన్ను రూ.26 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.26 వేలు పలికాయి.



టమాట కిలో రూ.13

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

గురువారం సాయంత్రం ఇఫ్తార్ : 6.31

శుక్రవారం ఉదయం సెహరీ : 5.11



న్యూస్‌రీల్

నేటి నుంచి గవిమఠం బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన గవిమఠం

ఉరవకొండ: ఉమ్మడి జిల్లాతో పాటు పొరుగున ఉన్న కర్ణాటకకు తలమానికంగా ఉన్న ఉరవకొండ గవిమఠ బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకూ చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 15న నాగభరణ ఉత్సవం, 16న నెమలి వాహనోత్సవం, 17న గవిమఠం పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి అడ్డపల్లకీ ఉత్సవం, అదే రోజు ఐరావత వాహనోత్సవం, 18న బసవేశ్వర వాహనం, మహాగణారాధన, 19న బ్రహ్మరథోత్సవం ఉంటుంది. 20న లంకాదహనం, 21న అశ్వవాహనోత్సవం, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ నేపథ్యంలో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఉత్సవాలకు వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండాద అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. చలువ పందిళ్లు, తాగునీటి కొళాయిలు, ఉచిత భోజనం, తాత్కాలిక మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులు కల్పించామన్నారు.

విషాదంలోనూ పరీక్షకు..

- గుండెపోటుతో తండ్రి మృతి
- పుట్టెడు దుఃఖంతో పరీక్ష రాసిన విద్యార్థిని



పరీక్ష రాస్తున్న తస్లీమ్

హిందూపురం: భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే తండ్రి అకస్మాత్తుగా దూరమయ్యారు. బాగా చదువుకోవాలన్న తండ్రి మాటలు మనసులో నింపుకున్న కుమార్తె అంతటి విషాదంలోనూ ఇంటర్ పరీక్షలు రాసింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఆబాద్ పేటకు చెందిన సిద్ధయ్య (38) పాత్రికేయుడిగా పనిచేసేవారు. మంగళవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. గంట ముందు తనతో మాట్లాడిన తండ్రి అంతలోనే కన్నుమూయడంతో కుమార్తె తస్లీమ్ గుండెలవిసేలా రోదించింది. అంతటి దుఃఖంలోనూ బాగా చదువుకుని మంచి స్థాయికి ఎదగాలన్న తండ్రి మాటలు గుర్తుకు వచ్చాయి. దీంతో బుధవారం హిందూపురంలోని బాలాజీ డిగ్రీ కళాశాల సెంటరులో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్ పరీక్షకు హాజరైంది. పుట్టెడు దుఃఖంతో పరీక్ష రాస్తున్న తస్లీమ్‌ను చూసిన వారి హృదయాలు బరువెక్కాయి.

నేడు 'ఈబీసీ నేస్తం' జమ

- ఉమ్మడి జిల్లాలో 38,098 మందికి రూ.57.15 కోట్ల చేయూత

అనంతపురం రూరల్: అగ్రవర్ణాల్లోని పేద మహిళలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. 'ఈబీసీ నేస్తం' పథకం ద్వారా ఒక్కొక్కరికి ఏటా రూ.15 వేలు అందిస్తోంది. ఇప్పటికే రెండేళ్ల పాటు నిధులు విడుదల చేసింది. మూడో విడతగా గురువారం మహిళల ఖాతాల్లో నగదు జమ చేయనుంది. నంద్యాల జిల్లా బనగానపల్లి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి జిల్లా వ్యాప్తంగా 38,098 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.57.15 కోట్ల నగదు జమ చేయనున్నారు. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో కార్యక్రమం నిర్వహించి కలెక్టర్, ప్రజాప్రతినిధులు చేతులమీదుగా మెగా చెక్కు విడుదల చేయనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం తెలిపారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల్లో చోటు



అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాల్లో పలువురికి చోటు కల్పించారు. ఈ మేరకు బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బీ. లలిత కల్యాణిని నియమించారు. అలాగే, వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కేవీ రమణ, కార్యదర్శిగా ఆకుల వెంకటనాగిరెడ్డి, సహాయ కార్యదర్శిగా బీ. శామ్యూల్ నియమితులయ్యారు.

నిఘా నీడన ఎన్నికలు

- అనంతపురం జిల్లాలో 1,107 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- 'శ్రీ సత్యసాయి'లో 781 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్
- ఇప్పటికే చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- లైసెన్సుడ్ తుపాకులన్నీ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- సమస్యాత్మక ప్రాంతాల జల్లెడ





సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రెండు జిల్లాల్లో భారీగా వెబ్‌కాస్టింగ్ (వెబ్ కెమెరాల ఏర్పాటు) చేయనున్నారు. అనంతపురం జిల్లాలో మొత్తం 2,213 పోలింగ్ కేంద్రాలు ఉండగా 1,107 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేపట్టాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. శ్రీకాకుళం, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తర్వాత ఎక్కువ వెబ్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న జిల్లాగా అనంతపురం మూడవ స్థానంలో నిలిచింది. శ్రీ సత్యసాయి జిల్లాలో 1,561 పోలింగ్ కేంద్రాలుండగా 781 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేయనున్నారు. ఎక్కడైనా చిన్న అవాంఛనీయ ఘటన జరిగినా పసిగట్టి చర్యలు తీసుకునేలా రూపకల్పన చేశారు. ఎన్నికల అధికారులు ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేసే అవకాశం ఉంటుంది. విజయవాడ నుంచి నేరుగా స్థానిక అధికారులకు ఆదేశాలు ఇవ్వవచ్చు.

తుపాకుల స్వాధీనం..

ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా పోలీసులు అప్రమత్తయ్యారు. సమస్యాత్మక ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. బైండోవర్ కేసు లున్న వారు, రౌడీషీటర్లకు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. రెండు జిల్లాల్లోనూ లైసెన్సు కలిగి ఉన్న వ్యక్తుల నుంచి తుపాకులు, రివాల్వర్లు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకింగ్ సేవల్లో ఉన్న సెక్యూరిటీ సిబ్బందికి మినహాయింపు ఇచ్చారు.

కర్ణాటక సరిహద్దు కట్టుదిట్టం

ఉమ్మడి అనంతపురం జిల్లాకు సరిహద్దుగా కర్ణాటక ఉంది. నిత్యం ఇక్కడి నుంచి కర్ణాటకకు, కర్ణాటక నుంచి ఉమ్మడి జిల్లాలోకి వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎన్నికల్లో మద్యం, డబ్బు ప్రవాహానికి అడ్డుకట్ట వేసేందుకు సరిహద్దులో నిఘా పెంచారు. ఎన్నికల నోటిఫికేషన్ అనంతరం ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే అనుమతించనున్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటారు. ఈ విషయాలన్నింటిపై రెండు జిల్లాల ఎస్పీలు పోలీసు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు.

ముమ్మరంగా ఏర్పాట్లు

మరో వైపు అధికారులు కూడా సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. ఇప్పటికే రెండు జిల్లాల కలెక్టర్లు స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలు పరిశీలించారు. ఎన్నికల విధుల కోసం అధికారుల నియామకం పూర్తి చేశారు. పోలింగ్ విధులు, ఈవీఎంల పనితీరు, వీవీప్యాట్లు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్ల పరిశీలన తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. మరో వైపు 100 శాతం పోలింగ్ లక్ష్యంగా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు.

రాయలసీమ జిల్లాల్లోని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ వివరాలు ఇలా..

జిల్లా	మొత్తం పోలింగ్ కేంద్రాలు	వెబ్‌కాస్టింగ్ నిర్వహిస్తున్నది
కర్నూలు	2,186	1,093
నంద్యాల	1,621	811
అనంతపురం	2,213	1,107
శ్రీ సత్యసాయి	1,561	781
అన్నమయ్య	1,607	804
చిత్తూరు	1,762	881
తిరుపతి	2,130	1,065

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం..



ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. అంతర్రాష్ట్ర సరిహద్దులో భద్రత పెంచాం. అక్రమంగా మద్యం, డబ్బు రవాణా కాకుండా పకడ్బందీగా వ్యవహరిస్తున్నాం.

– ఆర్.ఎస్.అమ్మిరెడ్డి, డీఐజీ

ఎన్నికల నిర్వహణకు సిద్ధం



వీసీలో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అని విధాల సంసిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముఖేష్‌కుమార్ మీనాకు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. బుధవారం విజయవాడ నుంచి కలెక్టర్లు, ఎస్పీలతో సీఈఓ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఎం. గౌతమి, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. జిల్లాలో చేపట్టిన ఏర్పాట్లపై ఈ సందర్భంగా సీఈఓకు కలెక్టర్ వివరించారు. కమిటీలను ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చామన్నారు. జిల్లాకు వచ్చిన 2,38,849 ఎపిక్ కార్డులను ఓటర్లకు పంపిణీ చేసే ప్రక్రియ వేగవంతం చేశామని చెప్పారు. దీనిపై సీఈఓ స్పందిస్తూ కలెక్టర్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎంసీఏ, ఎంబీఏ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) పరిధిలో ఫిబ్రవరిలో నిర్వహించిన ఎంసీఏ, ఎంబీఏ ఫలితాలు విడుదలయ్యాయి. ఎంసీఏ ఒకటో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్, సప్లిమెంటరీ ఎంసీఏ ఒకటో సెమిస్టర్ (ఆర్–20), (ఆర్–17) సప్లిమెంటరీ, ఎంసీఏ రెండో సెమిస్టర్ (ఆర్–21), (ఆర్–20), (ఆర్–17) సప్లిమెంటరీ, ఎంబీఏ ఒకటో సెమిస్టర్ (ఆర్–17)సప్లిమెంటరీ ఫలితాలు విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి తెలిపారు. ఫలితాల కోసం వర్సిటీ వెబ్‌సైట్ చూడాలని కోరారు.

హాల్‌టికెట్ చూపితే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

- పదో తరగతి విద్యార్థులకు డీఈఓ వరలక్ష్మి సూచన



మాట్లాడుతున్న డీఈఓ వరలక్ష్మి, చిత్రంలో పరీక్షల అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: హాల్‌టికెట్ చూపి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని పదో తరగతి విద్యార్థులకు డీఈఓ వరలక్ష్మి సూచించారు. బుధవారం డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలు 30న ముగుస్తాయన్నారు. రోజూ ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 142 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 40,063 మంది రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ప్రతి కేంద్రంలో కనీస మౌలిక వసతులు కల్పించామన్నారు. తాగునీరు, ఫర్నీచర్, లైటింగ్ ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. రెవెన్యూ, విద్యాశాఖ, పోలీసు అధికారులతో ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశామన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

పరీక్షల నిర్వహణ విధుల్లో పాల్గొనే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఈఓ ఆదేశించారు. ఇన్విజిలేటర్లు విద్యార్థులకు ప్రశ్నపత్రాలు ఇచ్చే సమయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. విద్యార్థి హాల్‌టికెట్‌ను పరిశీలించి ఏ మీడియం పరీక్ష రాస్తున్నారో అందుకు సంబంధించిన ప్రశ్నపత్రం ఇవ్వాలన్నారు. పొరబాటున తప్పు ప్రశ్నపత్రం ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్క్

జిల్లా అబ్జర్వర్, ఆర్జేడీ రాఘవరెడ్డి ఆదేశాల మేరకు ప్రతి మండలానికి మండల విద్యాశాఖ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు డీఈఓ వరలక్ష్మి తెలిపారు. వారి మండలంలోని సెంటర్లలో ఏ చిన్న సమస్య జరిగినా వారిదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు. ఎక్కువ సెంటర్లు ఉన్న మండలాల్లో ఎంఈఓ–2 కూడా చూసుకోవాల్సి ఉంటుందన్నారు. 142 మంది సీఎస్‌లు, 142 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 65 మంది అడిషనల్ డిపార్ట్‌మెంటల్ అధికారులు, దాదాపు 1700 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. ప్రభుత్వం ఈసారి ప్రశ్నపత్రాల తయారీలో కొత్త టెక్నాలజీ అమలు చేసిందన్నారు. ఎక్కడి నుంచైనా ఫొటో తీసినా, జిరాక్స్ చేయించినా అది ఏ ఊరు, ఏ కేంద్రం, ఏ విద్యార్థికి కేటాయించిన ప్రశ్నపత్రమో తెలిసిపోతుందన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్ల ఏర్పాటు

పరీక్షల సమయంలో ఇబ్బంది తలెత్తినా, అనుమానాలు ఉన్నా విద్యార్థులు, తల్లిదండ్రులు నివృత్తి చేసుకునేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. 94405 94773, 94415 75778 నంబర్లకు ఫోన్ చేయొచ్చని వెల్లడించారు. విద్యార్థులు 8.45 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ తెలిపారు. సెల్‌ఫోన్లు అనుమతించమని స్పష్టం చేశారు. పెన్నులు, పెన్సిళ్లు విద్యార్థులు తెచ్చుకోవాలన్నారు. ప్రశ్నపత్రం ఇచ్చిన తర్వాత ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలని సూచించారు.

18 నుంచి ఓపెన్ పరీక్షలు

సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్) స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలు 18 నుంచి ప్రారంభమవుతాయని డీఈఓ వరలక్ష్మి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 17 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 3,749 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వెల్లడించారు. సమావేశంలో డీసీఈబీ కార్యదర్శి పురుషోత్తంబాబు, సూపరింటెండెంట్ సరళ పాల్గొన్నారు.

సైకోలను శిక్షించాల్సిందే



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మహిళలు

గుంతకల్లుటౌన్: తన సొంతింటి కలను జగనన్న సాకారం చేశారని చెప్పిన గీతాంజలిని పొట్టనబెట్టుకున్న టీడీపీ, జనసేన సైకోలను కఠినంగా శిక్షించాలంటూ మహిళలు నినదించారు. గీతాంజలి ఆత్మ శాంతి కోసం బుధవారం రాత్రి గుంతకల్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భవానీ, వైస్ చైర్‌పర్సన్ మైమూన్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియాబేగం ఆధ్వర్యంలో పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక పొట్టిశ్రీరాములు సర్కిల్ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి ఆమె చిత్రపటం వద్ద అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోషల్ మీడియాలో టీడీపీ, జనసేన కార్యకర్తలు చేసిన ట్రోలింగ్‌తో మనస్తాపం చెందిన గీతాంజలి రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడడం దురదృష్టకరమన్నారు. డీజీపీని కలిసి దుండగులను శిక్షించాలని కోరినట్లు వెల్లడించారు. గీతాంజలి కుటుంబానికి సీఎం జగన్ మోహన్ రెడ్డి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియాను అందజేయడం హర్షణీయమన్నారు. మహిళల మాన,ప్రాణాలతో చెలగాటమాడుతున్న టీడీపీ, జనసేన పార్టీలకు రానున్న ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు రామలింగప్ప, రామాంజినేయులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, కౌన్సిలర్లు కెవి.నాగరత్న, నీలావతి, కుమారి, దర్గా చెన్నమ్మ, లింగన్న, సుధాకర్, సుమోబాష, చాంద్ బాష, రామాలయ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు మల్లికార్జున శాస్త్రీ, మండల కన్వీనర్ మోహన్, జేసీఎస్ కన్వీనర్ గోవింద్‌నాయక్, నాయకులు జయరామిరెడ్డి, సోమిరెడ్డి, రాము,వార్డు ఇన్‌చార్జ్‌లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం



సిద్ధేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం

అమరాపురం: మండల పరిధిలోని హేమావతిలో వెలిసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం బుధవారం కనుల పండువగా జరిగింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా కర్ణాటకలోని బెంగళూరు, మైసూరు, శిర, తుమకూరు, చెళ్లకెర, హిరియూర్, పావగడ, చిత్రదుర్గ, దావణగెర తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఉదయమే స్వామివారికి సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం వెండి ఆభరణాలతో స్వామివారిని అలంకరించి మహా మంగళహారతి ఇచ్చారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని వివిధ రకాల పూలమాలలతో అలంకరించి మేళతాళాలతో రథం వద్దకు తీసుకువచ్చి కొలువుదీర్చారు. 'ఓం నమః శివాయా... సిద్ధేశ్వరస్వామి మహారాజ్‌కీ జై, శివహర.. శంభో శంకర' అంటూ అశేష భక్తజనులు కీర్తిస్తుండగా, రథాన్ని ముందుకు లాగారు. ఈ సందర్భంగా భక్తులు అరటిపండ్లు, బెల్లం, కొబ్బరికాయ, పూలు, మిరియాలు తదితర వాటిని రథంపైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు.

ఆకట్టుకున్న వీరగాసే నృత్యం

సిద్ధేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం సందర్భంగా కర్ణాటక నుంచి వచ్చిన గురువులు చేసిన వీరగాసే నృత్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ, ఈఓ నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సర్పంచ్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం, అమెరికాలో స్థిరపడిన విజయలక్ష్మి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. మడకశిర, హిందూపురం ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు. సీఐ రాజకుమార్, ఎస్‌ఐ జనార్దన నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తినుబండారాలు, ఆట వస్తువుల దుకాణాలు కిటకిటలాడాయి.



దుకాణాల వద్ద భక్తుల కోలాహలం

బ్రహ్మోత్సవాలు బ్రహ్మాండంగా చేద్దాం

- 19 నుంచి ఏప్రిల్ 2 వరకూ ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను బ్రహ్మాండంగా నిర్వహిద్దామని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పిలుపునిచ్చారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో బుధవారం ఖాద్రీ ఆలయంలో ఈఓ వి.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, ఆర్డీఓ వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీలత హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సిద్దారెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 19 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకూ శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఖాద్రీశుని రథోత్సవానికి లక్షలాది మంది తరలివచ్చే అవకాశం ఉన్నందున ఆ మేరకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో భక్తులకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. మహిళలకు బాత్‌రూమ్‌లు, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. బ్రహ్మోత్సవాలు సాగినన్ని రోజులూ పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ అధికారులు కృషి చేయాలన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు రెవెన్యూ శాఖ నుంచి నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆర్డీఓకు సూచించారు. సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారథి ఆచార్యులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రణీత్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, నాగమల్లు, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్, పాలకమండలి మాజీ సభ్యులు శివకుమార్, నరసింహారెడ్డి, తలుపుల గంగాధర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

భానుడి ఉగ్రరూపం

అనంతపురం అగ్రికల్చర్: భానుడు క్రమక్రమంగా ఉగ్రరూపం దాలుస్తున్నాడు. వేసవి ఆరంభంలోనే సెగలు కక్కిస్తున్నాడు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటి 42 డిగ్రీల దిశగా సాగుతున్నాయి. బుధవారం శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం, చెన్నేకొత్తపల్లిలో ఏకంగా 41.3 డిగ్రీలు నమోదు కావడం వేసవి తీవ్రతకు అద్దం పడుతోంది. అలాగే బత్తలపల్లి, తలుపుల 41.2 డిగ్రీలు, ఆత్మకూరు, పరిగి 40.6 డిగ్రీలు, గుంతకల్లు 40.2 డిగ్రీలు, బుక్కరాయసముద్రం, వజ్రకరూరు 40.1 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా మండలాల్లో పగటి ఉష్ణోగ్రతలు 37 నుంచి 40 డిగ్రీల మధ్య కొనసాగాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు నాలుగైదు మండలాల్లో 20 నుంచి 22 డిగ్రీల మధ్య ఉండగా, చాలా మండలాల్లో 25 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. దీంతో పగలు, రాత్రి ఉక్కపోత అధికమవుతోంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సూర్యప్రతాపం కొనసాగుతోంది. మండే ఎండలకు మధ్యాహ్న సమయంలో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వడదెబ్బకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం హెచ్చరిస్తోంది.



బుధవారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారిన అనంతపురంలోని సుభాష్ రోడ్డు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి


లోకేష్

కళ్యాణదుర్గం రూరల్: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ 18 నెలల చిన్నారి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలం కోనాపురం గ్రామానికి చెందిన తిమ్మక్క, వన్నూరుస్వామి దంపతులు తమ కుమారుడు లోకేష్ (18 నెలలు)తో కలసి బ్రహ్మసముద్రం మండలం భైరసముద్రంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై వారు తిరుగు ప్రయాణమయ్యారు. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి వద్దకు చేరుకోగానే బెళుగుప్ప మండలానికి చెందిన సర్దార్‌వలి ఎదురుగా వేగంగా బైక్‌పై దూసుకొచ్చి ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన లోకేష్‌ని ఆస్పత్రికి తీసుకెళుతుండగానే మార్గమధ్యంలో మృతి చెందాడు. తిమ్మక్క, వన్నూరు స్వామి, సర్దార్‌వలికి సైతం గాయాలయ్యాయి. ఘటనపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మొండి బకాయిలపై దృష్టి

ఉరవకొండ: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) పరిధిలో మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం.లిఖిత తెలిపారు. బుధవారం ఉరవకొండలోని డీసీసీబీని ఆమె తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. పీఏసీఎస్‌లలో కంప్యూటరైజేషన్, క్రాప్ లోన్ రెన్యువల్‌పై ఆరా తీశారు. పంట రుణాలు రెన్యువల్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో బ్యాంక్ జనరల్ మేనేజర్ సురేఖారాణి, మేనేజర్ మల్లికార్జున, సిబ్బంది, పీఏసీఎస్ సీఈఓలు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి: స్థానిక పుట్లూరు మార్గంలోని రైల్వే లెవల్ క్రాసింగ్ సమీపంలో బుధవారం పేరం దేవరాజేశ్వరరెడ్డి (46) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప తెలిపారు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న ఆయన జీవితంపై విరక్తితో బుధవారం ఉదయం ఈ అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది.

ప్రగతి రథసారథికి మద్దతిద్దాం

- పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కమిటీ నేతలు


ఆర్టీసీ బస్టాండు

అనంతపురం క్రైం: ఉద్యోగం వచ్చిందన్న సంతోషం కన్నా సంస్థను ప్రైవేటుపరం చేస్తారన్న భయం పదుల సంవత్సరాలుగా వెంటాడింది. ప్రభుత్వాలు మారిన ప్రతి సారీ ఇదే భయంతో కొట్టుమిట్టాడారు. కానీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారిలో ఆ భయం పోయింది. సంస్థకు, అందులోని కార్మికులకు అభయం దక్కింది. ఓ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే అక్కడి రవాణా వ్యవస్థ బలంగా ఉండాలన్న సిద్ధాంతాన్ని నమ్మిన సీఎం వైఎస్ జగన్.. ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేస్తూ ప్రజారవాణా విభాగం (పీటీడీ)గా మార్చేశారు. ఈ నేపథ్యంలో అన్నింటా ప్రగతి పథంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపాలన్న సీఎం వైఎస్ జగన్ లక్ష్య సాధనకు 'మేము సైతం' అంటూ పీటీడీ ఉద్యోగులు బాసటగా నిలుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్న కుటిల నేతలకు బుద్ధి చెప్పేలా ప్రజలకు వాస్తవాలను వివరిస్తూ పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కమిటీ నేతలు బుధవారం బహిరంగ లేఖ విడుదల చేశారు.

నెరవేరిన కల



గత ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అధికారం చేపట్టిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తూ వచ్చారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడమనేది అత్యంత సాహసోపేత నిర్ణయం. దీనిని సాకారం చేసి..ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ప్రభుత్వ చర్యలతో వేలాది మంది ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారారు. దశాబ్దాల కలను సాకారం చేసిన సీఎం జగన్‌కే మా మద్దతు.

– విశ్వనాథరెడ్డి, జోనల్ అధ్యక్షుడు

ఆర్థిక భారాన్ని భరిస్తూ..



పీటీడీ ఉద్యోగులకు జీతాలు, ఇతర అలవెన్సుల కోసం నెలకు రూ.300 కోట్లు అవసరమవుతాయి. ఈ లెక్కన ఏడాదికి రూ.3,600 కోట్ల భారం ప్రభుత్వంపై పడుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లుగానే ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేశారు. మరే నేత ఈ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఉంటే ఎన్నికల వరకూ సాగదీసి చివరకు చేతులెత్తేసేవారు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన మూడు నెలల్లోనే లోటు బడ్జెట్‌ను కూడా లెక్క చేయకుండా ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేశారు. జీవితాల్లో వెలుగులు నింపిన జగన్‌కు ఆర్టీసీ ఉద్యోగులంతా మద్దతుగా నిలవాలి.

– సి.గోపాల్, రీజినల్ కార్యదర్శి

సాహసోపేత నిర్ణయం



ఆర్టీసీ ఉద్యోగుల కష్టనష్టాలను దగ్గరగా చూసిన జగన్‌మోహన్‌రెడ్డి సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడం సాహసోపేత నిర్ణయం. దీన్ని కూడా జీర్ణించుకోలేని కొన్ని శక్తులు ఉద్యోగులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూశాయి. ఆర్టీసీ విలీనం వల్ల ఎలాంటి ఉపయోగమూ లేదని దుష్ప్రచారం చేశాయి. కానీ ప్రభుత్వ ఉద్యోగులుగా మారడం వల్ల మాకు ఉద్యోగ భద్రత ఏర్పడింది. ఆర్టీసీని ప్రైవేటుపరం చేస్తారన్న భయం పోయింది.

– బి.సోమశేఖర్, డిపో కార్యదర్శి

బెనిఫిట్స్ సకాలంలో అందుతున్నాయి



ఆర్టీసీ విలీనం అనంతరం ప్రభుత్వం ఉద్యోగుల జీతభత్యాల కోసం సుమారు రూ.13 వేల కోట్లు ఖర్చు చేసింది. ఇంత పెద్ద మొత్తంలో సాయం చేయడం వల్లే ఆర్టీసీకి ఆర్థిక వెసులుబాటు కలిగింది. సీసీఎస్ రుణాలు, పీఎఫ్ డబ్బు లాంటి అనేక బెనిఫిట్లు అడిగిన వెంటనే ఉద్యోగుల చేతికి వస్తున్నాయి. మిగతా ప్రభుత్వ ఉద్యోగులతో పాటే పీఆర్సీ, డీఏలు వర్తిస్తున్నాయి. 2016 నుంచి ఆగిన కారుణ్య నియామకాలన్నింటినీ సీఎం జగన్ పునరుద్ధరించారు. సుమారు 2,000 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు ఇచ్చారు.

– ఆర్.విజయభాస్కరరెడ్డి, రీజినల్ అధ్యక్షుడు

కరోనా కష్టకాలంలోనూ ఆదుకున్నారు



కరోనా కష్టకాలంలోనూ పూర్తిస్థాయి జీతం తీసుకున్నది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులు మాత్రమే. మిగతా రాష్ట్రాల ఆర్టీసీలు కరోనా దెబ్బకు చతికిలపడ్డాయి. అక్కడ బస్సులు నడిపిన రోజులకు మాత్రమే జీతం చెల్లించారు. ఏపీలో మాత్రం బస్సులు తిరిగినా, తిరగకపోయినా ఉద్యోగికి ఒక్క రూపాయి కూడా జీతం తగ్గించలేదు. ఈ వాస్తవాన్ని ఉద్యోగులంతా గుర్తించాలి.

– ఎన్ఎస్ నాయక్, జోనల్ ఉపాధ్యక్షుడు

ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలి

- జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్


మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

ఉరవకొండ: ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాలని రాజకీయ పార్టీల నాయకులకు జాయింట్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్ సూచించారు. ఎన్నికల నేపథ్యంలో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులకు ఉరవకొండలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల వ్యయ పరిమితి, ర్యాలీలు, బహిరంగ సభలకు అనుమతులు మొదలైన అంశాలపై జేసీ కేతన్‌గార్గ్ అవగాహన కల్పించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వస్తుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలు ఉల్లంఘించరాదన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఎఫ్ఎస్‌టీ, ఎంసీసీ కంట్రోల్ రూం సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో విధివిధానాలపై చైతన్య పరిచారు.

విడపనకల్లులో జేసీ పర్యటన

విడపనకల్లు: మండల కేంద్రంలో బుధవారం జేసీ కేతన్‌గార్గ్ పర్యటించారు. జాతీయ రహదారి మీదుగా పోలీసు కవాతుతో ఆయన విడపనకల్లులోని పలు వీధులను సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై అక్కడి వారితో ఆరా తీస్తూ ముందుకు సాగారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలంటూ ప్రజలను చైతన్య పరిచారు. కార్యక్రమంలో తహసీల్దారు దస్తగిరయ్య, ఎంపీడీఓ కొండయ్య, గుంతకల్లు డీఎస్పీ శివభాస్కరరెడ్డి, ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ ఖాజాహుస్సేన్ పోలీసులు పాల్గొన్నారు.

ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు

విడపనకల్లు: ఉరవకొండ పట్టణానికి చెందిన హరిజన శ్రీకాంత్‌ను కిడ్నాప్ చేసి కొట్టి, తీవ్రంగా గాయపరిచిన ఘటనలో ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. హరిజన శ్రీకాంత్ కర్ణాటకలోని రూపనగుడి నుంచి కొట్టాలపల్లి మీదుగా ద్విచక్ర వాహనంపై వస్తుండగా అదే మార్గంలో విడపనకల్లు మండలం పెద్ద కొట్టాలపల్లి గ్రామానికి చెందిన జయకృష్ణ తన కారుతో ఓవర్ టేక్ చేసి సడన్‌గా కారు ఆపాడు. ఆ సమయంలో వెనుకనే ఉన్న ద్విచక్రవాహనం నేరుగా వెళ్లి కారు కుడివైపు ఉన్న అద్దానికి తగిలింది. దీంతో జయకృష్ణతో పాటు కారులో ఉన్న మరో ఇద్దరు శ్రీకాంత్‌ను బూతులు తిడుతూ కారులో అపహరించుకెళ్లి పెద్దకొట్టాలపల్లి సమీపంలోని పొలాల్లో దాడి చేసి, గాయపరిచారు. అనంతరం కారును రిపేరు చేయించాలంటూ అనంతపురానికి తీసికెళ్లారు. వారి చెర నుంచి అనంతపురంలో తప్పించుకున్న శ్రీకాంత్ నేరుగా జీజీహెచ్‌కు వెళ్లి అడ్మిట్ అయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విడపనకల్లు పోలీసులకు రెఫర్ చేయడంతో జయకృష్ణ, మరో ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్సీ తల్లి మృతికి మాజీ ఎమ్మెల్యే విశ్వ సంతాపం

ఉరవకొండ: ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి మాతృమూర్తి వై.లలితమ్మ (86) మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి బుధవారం సంతాపం వెలిబుచ్చారు. ఫోన్ ద్వారా లలితమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

యువకుడిపై ఎలుగుబంటి దాడి

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక కోటవీధికి చెందిన యువకుడు శ్రీనాథ్‌పై ఎలుగుబంటి దాడి చేసింది. బుధవారం తెల్లవారుజామున పట్టణ శివారు ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లిన సమయంలో పొదల మధ్య నుంచి ఒక్కసారిగా ఎలుగుబంటి దాడి చేసింది. అప్రమత్తమైన శ్రీనాథ్ వెంటనే కేకలు వేస్తూ బెదిరించడంతో కొండల్లోకి ఎలుగుబండి పారిపోయింది. ఘటనలో గాయపడిన శ్రీనాథ్‌ను స్థానికులు సీహెచ్‌సీకి తరలించారు.

మొల్లమాంబ జీవితం ఆదర్శం


మొల్లమాంబ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్వో రామకృష్ణారెడ్డి, బీసీ సంక్షేమాధికారి కుష్బుకొఠారి


మొల్లమాంబ గురించి వివరిస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం అర్బన్: విలువలతో కూడిన కవిత్వాన్ని సమాజానికి అందించిన కవయిత్రి మొల్లమాంబ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ అధికారి కుష్బూకొఠారి అధ్యక్షతన నిర్వహించిన మొల్లమాంబ జయంతి కార్యక్రమానికి డీఆర్‌ఓ ముఖ్యఅతిథిగా హాజరై, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. 16వ శతాబ్దపు కవయిత్రిగా మొల్లమాంబ ఎంతో ప్రసిద్ధిగాంచారన్నారు. విలువలతో కడిన కవిత్వాన్ని సమాజానికి అందించిన మొల్లమాంబను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కుమ్మర శాలివాహన ఉద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళపతి, కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు రామాంజినేయులు, శ్రీనివాసులు, జలాలపురం పోతులయ్య, సతీష్‌కుమార్, లక్ష్మీనారాయణ, ఓబులేసు, రామాంజనేయులు, జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారులు రవీంద్రనాథ్ ఠాగూర్, మారుతి పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

అనంతపురం: కవిత్వమైనా.. బోధనలైనా.. ప్రజల మనసుల్లో సుస్థిరమైన స్థానాన్ని ఏర్పరుచుకున్నప్పుడే వారు చిరస్థాయిగా నిలిచిపోతారని.. ఈ కోవకు చెందిన వారిలో మొల్లమాంబ అగ్రగణ్యులని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అన్నారు. విలువలతో కూడిన కవిత్వాన్ని సమాజానికి అందించడం ద్వారా తన ప్రత్యేకతను ఆమె చాటుకున్నారన్నారు. మొల్లమాంబ జయంతిని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఎస్పీతో పాటు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్ రెడ్డి (అడ్మిన్), జి.రామకృష్ణ (సెబ్), ఎస్.లక్ష్మీనారాయణ రెడ్డి (ఏ.ఆర్), అనంతపురం రూరల్ డీఎస్పీ బీవీ శివా రెడ్డి, జిల్లా పోలీసు కార్యాలయ ఏఓ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి 'ఇన్‌స్పైర్'కు జిల్లా విద్యార్థి


ఎంపికైన విద్యార్థిని జ్యోతి, గైడ్ టీచరు నారాయణ

అనంతపురం ఎడ్యుకేషన్: జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు జిల్లాకు చెందిన విద్యార్థిని ఎంపికైంది. వివరాలు... ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు చిత్తూరు జిల్లా పలమనేరులో రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు గుంతకల్లు మండలం కసాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని జ్యోతి, తన గైడ్ టీచరు నారాయణతో కలసి పాల్గొంది. 'సోలార్ మల్టీ పర్పస్ పోర్టబుల్ టెంట్' అంశంపై తాను రూపొందించిన ప్రాజెక్ట్ జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించడంతో గైడ్ టీచర్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినితో పాటు గైడ్ టీచర్‌ను డీఈఓ వరలక్ష్మి అభినందించారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి

- లబ్ధిదారులకు కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ సూచన


మెగా చెక్ విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, తదితరులు

అనంతపురం అర్బన్: పీఎం సూరజ్ పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలపడాలని లబ్ధిదారులకు కలెక్టర్ ఎం.గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సూచించారు. పథకాన్ని బుధవారం ఢిల్లీ నుంచి వర్చువల్ విధానంలో ప్రధాని మోదీ ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమం ద్వారా కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, ఆర్‌టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, డీసీసీబీ చైర్‌పర్సన్ నిఖిత పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడారు. ఎస్సీ, ఓబీసీ, సఫాయి కర్మచారీ కార్మికులు ఆర్థికంగా అభివృద్ధి చెంది జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం సూరజ్ పథకం ద్వారా రుణాలను అందిస్తోందన్నారు. వ్యవసాయం, చిరు వ్యాపారాలు చేసుకునేందుకు 29 మంది లబ్ధిదారులకు రూ.58.25 లక్షలు మంజూరైనట్లు వివరించారు. ఇందుకు సంబంధించిన మెగాచెక్‌ను విడుదల చేశారు. అలాగే ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకం కింద 55 మంది లబ్ధిదారులకు రూ.2.27 కోట్లు, ఎన్ఎస్ఎఫ్‌డీసీ పథకం కింద 321 మందికి రూ.18.97 కోట్లు, ఎన్‌బీసీఎఫ్‌డీసీ కింద 31 మందికి రూ.3.83 కోట్లు, స్త్రీ నిధి కింద 40 మంది లబ్ధిదారులకు 28.90 లక్షల రుణం మంజూరు చేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్ రావు, బీసీ సంక్షేమాధికారి కుష్బూకొఠారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో టీడీపీ ప్రలోభాల పర్వం

- పంపిణీ చేసిన చీరలు, కరపత్రాలను దహనం చేసిన దుద్దేకుంట వాసులు


దుద్దేకుంటలో టీడీపీ పంపిణీ చేసిన చీరలు, కరపత్రాలను దహనం చేస్తున్న దృశ్యం

బెళుగుప్ప: ఉరవకొండ నియోజకవర్గంలో మహిళా ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే చర్యలను ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ వేగవంతం చేశారు. తన అనుచరుల ద్వారా మహిళలకు ఉచితంగా చీరల పంపిణీని పెద్ద ఎత్తున చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం బెళుగుప్ప మండలం ఎర్రగుడి, విరుపాపల్లి, గంగవరం గ్రామాల్లో ఆటోల్లో చీరలు తీసుకెళ్లి ఇంటింటా పంపిణీ చేసారు. రూ.100 విలువ కూడా చేయని చీరలను పంపిణీ చేస్తూ మహిళల ఆత్మగౌరవాన్ని ఎమ్మెల్యే కేశవ్ కించపరుస్తున్నారంటూ ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మచ్చన్న, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ దుద్దేకుంట రామాంజినేయులు మండిపడ్డారు. కాగా, పంపిణీ చేసిన చీరలను కొందరు మహిళలు రోడ్డుపై పడేశారు. దుద్దేకుంట అంబేడ్కర్ కాలనీలో టీడీపీ నాయకులు పంపిణీ చేసిన చీరలు, కరపత్రాలను స్థానికులు మంటల్లో వేసి కాల్చేశారు.

చీనీలో వేరుకుళ్లు

- పరిశీలనకు నేడు కమిషనరేట్ బృందం రాక



వేరుకుళ్లు తెగులుతో ఎండిన చీనీచెట్టు

అనంతపురం అగ్రికల్చర్: వేరుకుళ్ల తెగుళ్ల ఆశించి చీనీ చెట్లు ఎండిపోతున్న ప్రస్తుత తరుణంలో రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానశాఖ ఇన్‌చార్జ్ డీడీ నరసింహారావు కోరారు. పలు రకాల సూక్ష్మాతిసూక్ష్మజీవులు అనేక తెగుళ్ల వ్యాప్తికి కారణమైనట్లుగా తిరుపతి చీనీ నిమ్మ పరిశోధనా స్థానానికి చెందిన శాస్త్రవేత్తలు గుర్తించారన్నారు. దీంతో పరిశీలనకు కమిషనరేట్ అధికారుల బృందం జిల్లాలోని గార్లదిన్నె, కూడేరు, పుట్లూరు, యల్లనూరు ప్రాంతాల్లో గురువారం పర్యటించనుందన్నారు.

యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

వేరుకుళ్లు, ఎండు తెగులును ప్రారంభ దశలోనే గుర్తించి సరైన యాజమాన్యం చేపడితే చెట్లను కాపాడుకోవచ్చునన్నారు. నీటి తడులు క్రమ పద్ధతిలో ఇవ్వాలన్నారు. వేసవిలో బెట్ట నివారణకు ఎండు ఆకులు, వరి, వేరుశనగ, పెసర, మినుము లాంటి పొట్టును 20 నుంచి 30 కిలోలు చెట్టు చుట్టూ రెండు మూడు అంగుళాల మందంతో వేయాలన్నారు. 20 లీటర్ల నీటికి 3 గ్రాముల మాంకోజెబ్ కలిపి లేదా 1 శాతం బోర్డో మిశ్రమాన్ని గాని చెట్టు పాదుల్లో నీరు పెట్టిన 24 గంటల తర్వాత పోయాలన్నారు. ఆగస్టు–సెప్టెంబర్‌లో జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు చల్లి 50 శాతం పూత దశలో ఉన్నప్పుడు నేలలో కలియదున్నాలని తెలిపారు. ఒక కిలో ట్రైకోడెర్మావిరిడీ, 10 కిలోలు వేపపిండి, బాగా మాగిన 90 కిలోలు పశువుల ఎరువు మిశ్రమాన్ని గోనేసంచుల్లో కప్పి నీళ్లు చల్లుతూ వారం రోజుల్లో నీడలో పెట్టిన తర్వాత ఈ మిశ్రమ ఎరువును చెట్టుకు 10 కిలోల చొప్పున పాదుల్లో వేయాలన్నారు. ఇలా ఆరు నెలలకు ఒకసారి చేస్తే వేరుకుళ్లు తెగులును సమర్థవంతంగా నివారించుకోవచ్చన్నారు. అలాగే 5 గ్రాముల జింక్‌సల్ఫేట్, 2 గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్, 2 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్, 2 గ్రాముల మాంగనీసు సల్ఫేట్, 1 గ్రాము బోరాక్స్, 6 గ్రాముల సున్నం, 10 గ్రాముల యూరియా ఒక లీటర్ నీటికి కలిపి ఏడాదికి నాలుగు సార్లు విప్పారిన లేత ఆకుల మీద పిచికారీ చేస్తే సూక్ష్మ ధాతు లోపాలను నివారించుకోవచ్చన్నారు.

కలెక్టర్‌ను కలసిన ఇంటర్ బోర్డు కమిషనర్


కమిషనర్ సౌరబ్‌గౌర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ఇంటర్మీడియేట్ పరీక్షలు నిర్వహణ తీరు బాగుందని కలెక్టర్ ఎం.గౌతమిని ఇంటర్ బోర్డు కమిషనర్ సౌరబ్‌గౌర్ అభినందించారు. బుధవారం కలెక్టరేట్‌కు విచ్చేసిన ఆయన కలెక్టర్‌ను ఆమె చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు కలెక్టర్ పుష్పగుచ్ఛం అందజేశారు.

గీతాంజలి ఆత్మహత్య బాధాకరం

- రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియాబేగం



గుత్తి: తెనాలికి చెందిన గీతాంజలి మృతిపై రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియాబేగం స్పందించారు. ఆమె ఆత్మహత్య బాధాకరమని అన్నారు. గుత్తిలోని తన కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. నిరుపేద కుటుంబానికి చెందిన గీతాంజలి కొన్ని రోజుల క్రితం ప్రభుత్వం నుంచి తాను పొందిన లబ్ధిపై హర్షం వ్యక్తం చేస్తూ ఓ యూట్యూబ్ చానల్‌తో మాట్లాడిందని గుర్తు చేశారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని టీడీపీ, జనసేన నేతలు సోషల్ మీడియాలో అసభ్యకరంగా ట్రోల్ చేసి ఆమె ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీశారన్నారు. దీంతో మనస్తాపానికి గురైన గీతాంజలి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే గీతాంజలి మృతికి కారణమైన టీడీపీ, జనసేన సోషల్ మీడియా ప్రతినిధులపై కేసు నమోదు చేయడంతో పాటు కఠినంగా శిక్ష పడేలా చేయాలన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ పాటు పడుతున్నారన్నారు. ఇది గిట్టని ఎల్లోమీడియా, ఎల్లో సోషల్ మీడియా పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని మండిపడ్డారు.

ప్రభుత్వ మేలు మరచిపోవద్దు

- జనశక్తి నగర్ ముంపు సమస్యకు పరిష్కారం చూపాం
- వైఎస్సార్‌సీపీని ఆదరించాలి
- ఎమ్మెల్యే అనంత పిలుపు
- 41వ డివిజన్‌లో కొనసాగిన ఇంటింటికీ వైఎస్సార్ సీపీ


వృద్ధురాలికి పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వం చేసిన మేలు మరచిపోవద్దు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఆదరించాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి జనశక్తి నగర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం నగరంలోని 41వ డివిజన్ జనశక్తి నగర్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి గడపకు వెళ్లిన ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. గత టీడీపీ ప్రభుత్వానికి, తమ ప్రభుత్వాన్ని వ్యత్యాసాన్ని గుర్తించాలన్నారు. వర్షం వస్తే జనశక్తి నగర్ వాసులు ఇబ్బంది పడే పరిస్థితులు ఉండేవన్నారు. వరద సమస్య లేకుండా పెద్ద కాలువలు ఏర్పాటు చేసేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.84 లక్షలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం కాలువ ఏర్పాటు పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు వెల్లడించారు. కాలువ ఏర్పాటుతో వరద సమస్య చాలా వరకూ తగ్గుతుందన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో రోడ్లు, ప్రశాంతి నగర్ రూ.1.30 కోట్లతో (కోటి 30 లక్షలు) 8 కచ్చా రోడ్లు, కాలువలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నాడు–నేడు కింద రాంబాబు మెమోరియల్ నగరపాలక పాఠశాలలో రూ.13 లక్షలతో పునరుద్ధరణ పనులు చేపట్టామన్నారు. 41వ డివిజన్‌లో రూ.3 కోట్ల వరకూ అభివృద్ధి పనులు చేపట్టినట్లు గుర్తు చేశారు. ఇక అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడం జరిగిందన్నారు.

ఇంటి వద్దకే పాలన..

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పాలననందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. గతంలో ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే తహసీల్దార్, నగరపాలక సంస్థ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదన్నారు. అటువంటిది నగరంలో ఏకంగా 74 సచివాలయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి సచివాలయంలో వివిధ విభాగాలకు సంబంధించి ఉద్యోగులను అందుబాటులో ఉంచి సేవలందిస్తున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఆదర్శవంతమైన పాలన సాగుతోందన్నారు. మరోమారు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చేసుకుంటే ఇంటి వద్దకే పాలన, సంక్షేమం, అభివృద్ధి నిరంతరంగా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయ భాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి, క్లస్టర్ అధ్యక్షుడు మధు, అనుబంధ సంఘాల అధ్యక్షులు కొర్రపాడు హుస్సేన్ పీరా, ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, సైఫుల్లా బేగ్, శ్రీదేవి, కార్పొరేటర్లు గోగుల లక్ష్మీదేవి, ఇసాక్, బాలాంజినేయులు, నాయకులు రాధాకృష్ణ, జానీ, ఖాజా, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, కేశవరెడ్డి, అనిల్ కుమార్ గౌడ్, జావెద్, రాజారత్నం, ఉష, గౌరి, సుహాసిని, విజయ్‌కుమార్, రాజు, దాదు, దేవి, పార్వతి, మహబూబ్ బాషా, లోకేష్ ఆచారి, వీరాంజి, శ్రీనాథ్, రఫీ, రాజారత్నం పాల్గొన్నారు.

నేడు 20వ డివిజన్‌లో..

నగరంలోని 20వ డివిజన్‌లో గురువారం ఉదయం 7 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని సంగమేష్ సర్కిల్ సిండికేట్ బ్యాంక్ నుంచి కార్యక్రమం మొదలవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

జగన్ చెప్పారంటే.. చేస్తారంతే



రామగిరి: వైఎస్సార్ చేయూత మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కనగానపల్లి: వైఎస్సార్ చేయూత సంబరాల్లో పాల్గొన్న మహిళలు

- శ్రీశైలంలో నీరు ఉన్నంత వరకూ పేరూరు డ్యాంకు కృష్ణా జలాలు
- చంద్రబాబు అన్ని వర్గాలను మోసం చేశారు
- పరిటాల కుటుంబం దోచుకుని, దాచుకోవడానికే సరిపోయింది
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: జగన్ ఏదైనా చెప్పారంటే.. చేసి తీరుతారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కొనియాడారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ చేయూత సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు పచ్చి అబద్ధాల కోరని.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిజం అన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీలను చూడకుండా అన్ని వర్గాలకు సమన్యాయం చేశారని తెలిపారు. అయితే గత టీడీపీ ప్రభుత్వంలో పచ్చ నాయకులకే పింఛన్లు, ప్రభుత్వ పథకాలు అందాయని పేర్కొన్నారు. చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. గత ప్రభుత్వానికి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాని తేడాను మీరే గమనించాలని సూచించారు. పరిటాల కుటుంబం 25 ఏళ్లుగా మంత్రులు, ఎమ్మెల్యేలుగా ఉన్నా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. పేరూరు డ్యాంకు నీరు తీసుకురాకుండా దోచుకుని, దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. దీంతో అప్పట్లో ఈ ప్రాంతంలో చాలామంది రైతులు, ప్రజలు జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ముత్యాలమ్మ ఆలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి తెచ్చామన్నారు. రామగిరి బంగారు గనులు తెరిపించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే టెండర్లు పూర్తి చేసి, సర్వే పనులు పూర్తయ్యాయన్నారు. త్వరలోనే గనుల త్రవ్వకాలు చేపట్టేలా చర్యలు చేపడతామని 3,000 మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. రామగిరి, కనగానపల్లి మండలాల్లో సోలార్‌ప్లాంట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో గార్మెంట్ తదితర పరిశ్రమను నెలకొల్పితే 15000 మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందన్నారు. రామగిరి మండలంలో 3000 మందికి ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. సొంత నిధులతో ఈ ప్రాంతం వారికి ఉచిత ంగా బోర్లు వేయించామన్నారు. పేరూరు డ్యాంకు కృష్ణా జలాలు తీసుకురావడం జరిగిందన్నారు. అనంతరం రామగిరిలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన వ్యవసాయ గోడౌన్ ప్రారంభించారు. పోలేపల్లిలో సచివాలయం, ఆర్బీకె, హెల్త్‌సెంటర్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీ నాగార్జున, మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, సర్పంచులు మీనుగ నాగరాజు, రాజేష్, నరేంద్ర, చెన్నకేశవరెడ్డి, రామ్మూర్తి, ఓబిరెడ్డి, సిద్దన్న, ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాలప్ప, కో-ఆప్షన్ మెంబర్ ముజుబుర్, సింగల్ విండో ప్రెసిడెంట్ ముత్యాలు, నాయకులు నరసింహారెడ్డి, వెంకట రెడ్డి, ఆదిరెడ్డి, బండారు అనిల్, జేష్ఠరామయ్య, రాజశేఖర్‌రెడ్డి, రామాంజనేయులు, ఓబలేష్, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

చేయూతతో మహిళలకు ఉపాధి..

కనగానపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల మహిళలకు ఉపాధి లభిస్తోందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో వైఎస్సార్ చేయూత సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళా సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 50 వేల మందికి పింఛన్లు, 17 వేల మందికి ఇళ్లు మంజూరు చేయించామన్నారు. ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు సక్రమంగా కొనసాగాలంటే వైఎస్సార్ సీపీని తిరిగి అధికారంలోకి తెచ్చుకోవాలన్నారు. అనంతరం మహిళలకు వైఎస్సార్ చేయూత చెక్కు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, వైస్ ఎంపీపీలు పద్మావతి, నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, పలువురు ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, వైకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కనకదాస విగ్రహ ప్రతిష్ట


అలంకరణలో కనకదాస విగ్రహం

రాప్తాడు: కురుబల ఆరాధ్య దైవం.. కనకదాస విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం బుధవారం నియోజకవర్గ కేంద్రంలో భక్తిశ్రద్ధలతో సాగింది. కురుబ కుల పెద్దలు పార్టీలకు అతీతంగా జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. విగ్రహాన్ని ఆవిష్కరించి, విశేష పూజల్లో పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్ట తర్వాత ప్రతి ఇంటి నుంచి మహిళలు, యువతులు పెద్ద ఎత్తున జ్యోతులతో ఊరేగింపు చేపట్టారు. విగ్రహం ముందు గొరవయ్యలు చేసిన నృత్యం అందరినీ అలరించింది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ అన్నదానం ఏర్పాటు చేశారు.

ఈవీఎంల భద్రతలో జాగ్రత్తలు తీసుకోండి


ఈవీఎంలను పరిశీలిస్తున్న కమిషనర్ మేఘస్వరూప్

అనంతపురం అర్బన్: ఈవీఎంలు, వీవీప్యాట్లు, కంట్రోలింగ్ యూనిట్ల భద్రతలో జాగ్రతలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్, ఈవీఎం మేనేజ్మెంట్ కమిటీ నోడల్ అధికారి మేఘస్వరూప్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక పాత ఆర్‌డీఓ కార్యాలయం ఆవరణలోని గోదాములో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈవీఎంలు భద్రతలో రాజీ పడకూడదన్నారు. నిరంతర నిఘా పెట్టాలని సూచించారు. సీసీ కెమెరాలు, పోలీసు బందోబస్తు పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, డీటీ దివాకర్‌రావు, ఎస్‌ఏ శామ్యూల్ బెంజిమన్, తదితరులు పాల్గొన్నారు.

మాధవరాజుల ఆలయానికి మట్టి రోడ్డు


ఆలయాని వెళ్లే దారిలో మట్టి రోడ్డు వేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో మండలంలోని సనప గ్రామంలో మాధవరాజుల స్వామి ఆలయానికి వెళ్లే దారిలో మట్టి రోడ్డు వేయించారు. వివరాలు.. సనప గ్రామం నుంచి మాధవరాజుల స్వామి ఆలయానికి వెళ్లే దారి గుంతలు పడి ప్రయాణానికి ఇబ్బందిగా మారింది. దారిలో ఉన్న ముళ్ల చెట్లను తొలగించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశించారు. అలాగే దారి పక్కన ఉన్న మట్టిని తవ్వి మట్టి రోడ్డు వేయించాలని సూచించారు. స్పందించిన వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం జేసీబీతో మట్టి రోడ్డు వేయించారు. సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు, భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నవ్య పరిశోధనలతోనే నూతన సమాజం


మాట్లాడుతున్న జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు

అనంతపురం: నవ్య పరిశోధనలతోనే నూతన సమాజం సాధ్యమని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలోని ఈఈఈ విభాగంలో అటల్ టింకరింగ్ ల్యాబ్ అంశంపై మూడు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. ప్రారంభ సదస్సుకు వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో నెలకొన్న సాంకేతిక సమస్యలకు పరిష్కారం ఇవ్వగలిగే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఉన్నత విద్యామండలి, బీసీడీఈ(బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్), యునిసెఫ్, విగ్యాన్ ఆశ్రం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అటల్ ల్యాబ్స్‌ను స్థాపించారు. బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ సంయుక్తంగా ఉన్నత విద్య చదివే విద్యార్థులకు అటల్ ల్యాబ్స్‌పైన శిక్షణ ఇవ్వనున్నారు. అనుబంధ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఈ శిక్షణకు హాజరయ్యారు. ఒక రోజు కురుగుంటలోని ఏపీఆర్ఎస్ స్కూల్‌లో ఉన్న అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను విద్యార్థులను సందర్శించనున్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, బీసీఈడీ సీఈఓ, సెక్రెటరీ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవకుమార్, వర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసులు , యూనిసెఫ్ కన్సెల్టెంట్ , కోఆర్డినేటర్ సుదర్శన్, విగ్యాన్ ఆశ్రం కార్యక్రమ అధికారి కిషోర్ గైక్వాడ్, జిల్లా సైన్స్ అధికారి బాలమురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
- గొరిదిండ్ల వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ


విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం జగన్ నెరవేర్చారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని గొరిదిండ్ల గ్రామ సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పరిటాల సునీత ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పటికీ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ముఖ్యమంత్రి జగనన్న రైతులకు అండగా నిలుస్తున్నారన్నారు. పంచాయతీల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనాలు, మందులు, ఎరువులకు ఇబ్బందులు లేకుండా చేశారన్నారు. ప్రస్తుతం మండలంలో గొరిదిండ్ల, తోపుదుర్తి గ్రామాలకు విద్యుత్ సబ్‌స్టేషన్‌లు మంజూరైనట్లు పేర్కొన్నారు. రూ.117 కోట్లతో రోజుకు 16 గంటలు నీరు అందేలా పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. త్వరలోనే ట్రైల్ రన్ కూడా చేస్తామని వెల్లడించారు. విద్యుత్ కోతలు లేకుండా లోడ్ ఎక్కువ లేకుండా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సబ్‌స్టేషన్లు నిర్మించి రైతుల సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు.

చంద్రబాబువి అబద్ధపు హామీలు..

ప్రజలను మోసం చేయడంతో చంద్రబాబు మహాఘనుడని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. గతంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణాల మాఫీ అంటూ మహిళలను మోసం చేశారని మండిపడ్డారు. ఇంటికో ఉద్యోగం అంటూ యువతను మోసం చేశారని తెలిపారు. మళ్లీ అధికారం కోసం నెరవేరని హామీలను ఇస్తూ ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ మోసపూరిత మాటలు నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరన్నారు. మళ్లీ ఫ్యాన్ ప్రభంజనం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బాలపోతన్న, వైస్ ఎంపీపీ విజయ్, సర్పంచులు నాగరత్నమ్మ, తిరుపాలమ్మ, ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణరెడ్డి, ఎంపీటీసీ చిట్టెమ్మ, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బంధూక మధు, వాసుదేవరెడ్డి, ఫణిరెడ్డి, ముత్యాల రెడ్డి, బాలస్వామి రెడ్డి, పోతులయ్య, నరసింహులు, రాము నాయక్, మాధన్న, గోవింద్, అతిక్ రెడ్డి, నరసింహులు, రవి, కేశవరెడ్డి, అంజినప్ప, పోతన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఫీజు చెల్లించలేదని బయట నిలబెట్టారు'


రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం: విద్యా దీవెన ఫీజులు చెల్లించలేదనే కారణంతో అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులను కళాశాల బయటే నిలబెట్టారు. అధిక తీవ్రమైన ఎండలోనూ విద్యార్థులను బయటే నిలబెట్టి ఫీజులు చెల్లించాలని సంబంధిత కళాశాల ఉద్యోగులు భయపెట్టారు. ఇంకా మా తల్లుల ఖాతాల్లో నగదు జమ కాలేదని విద్యార్థులు చెబుతున్నా.. ఖాతరు చేయలేదు. దీంతో వర్సిటీ ఉన్నతాధికారులు కలుగజేసుకుని కళాశాల యాజమాన్యాన్ని మందలించడంతో విద్యార్థులను అనుమతించారు. అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం వైఖరిపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

కళాశాలపై చర్యలు తీసుకోండి..

అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం విద్యార్థులను ఇబ్బందులకు చేస్తోందని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. బుధవారం జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్‌కు వినతిపత్రం అందజేశారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యా దీవెన తల్లుల ఖాతాల్లో జమ అవుతుండగా, వెంటనే చెల్లించాలని విద్యార్థులను వేధిస్తున్నారని తెలిపారు. మొత్తం ఫీజు కడితేనే మిడ్ పరీక్షలకు అనుమతిస్తాం.. ఇంటర్నల్ మార్కులు వేస్తామంటూ భయపెడుతున్నారన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, సిద్దు, గిరి, శివ, భీమేష్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక అశోక్‌నగర్‌లోని మినర్వా పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. పరీక్షలు రాయబోతున్న పదో తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల్లో సహజంగా కలిగే భయం తొలిగించడానికి సూచనలు ఇచ్చారు. భవిష్యత్తులో ఏ స్థాయికి ఎదిగినా చదువుకున్న పాఠశాల, చదువు చెప్పిన గురువులను మరిచిపోవద్దన్నారు. అనంతరం విద్యార్థులకు అట్టలు పంపిణీ చేశారు.

'చంద్రబాబుకు ఓటేస్తే పథకాల రద్దు'


పంచాయతీ రాజ్ కాలనీలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడు: రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు ఓటేస్తే ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలతో పాటు వలంటీర్ వ్యవస్థను రద్దు చేస్తారని వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని ఇందిరమ్మ కాలనీ, పంచాయతీ రాజ్ కాలనీలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా ఇంటి ముంగిటకే అందజేస్తున్నారన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రజలు ఆశీర్వాదించాలన్నారు. ఎంత మందితో పొత్తులు పెట్టుకున్న చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గవ్వల పరంధామ, యూత్ కన్వీనర్ విశ్వనాథ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెన్నపూస లోకేశ్వర్ రెడ్డి, విజయ్ వర్ధన్ రెడ్డి, బోయ మనోహర్, డీలర్ సాంబ శివారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అభాగ్యుడికి 'అమ్మ' చేయూత


నిరుపేద కుటుంబానికి సాయం అందజేస్తున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: ఓ నిరుపేద కుటుంబానికి అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి అండగా నిలిచారు. వివరాలు.. నగరంలోని సుందరయ్య కాలనీకి చెందిన వినోద్ లారీ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. ప్రస్తుతం అతడి భార్య నిండు గర్భవతి. జనవరి 12న చిత్రదుర్గం వద్ద జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో వినోద్ తీవ్రంగా గాయపడ్డాడు. దాదాపు 10 గంటల పాటూ స్పృహ లేకుండా కొట్టుమిట్టాడి చివరికి కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. కుడి కాలు, ఎడమ చేయి బాగా దెబ్బతిన్నాయి. ఆపరేషన్ చేయకపోతే ప్రాణానికే ముప్పు ఉంటుందని వైద్యులు తెలిపారు. ఆపరేషన్‌కు రూ.4 లక్షలు ఖర్చవుతుందని కుటుంబ సభ్యులకు చెప్పారు. బాధిత కుటుంబ సభ్యులు అమ్మ సంస్థ నిర్వాహకుడు రమణారెడ్డిని ఆశ్రయించారు. స్పందించిన రమణారెడ్డి బుధవారం బాధిత కుటుంబాన్ని కలిశారు. తక్షణ సాయంగా రూ.50 వేల నగదు, రూ.10 వేల విలువ చేసే వీల్‌చైర్, రూ.5 వేల హెడ్‌రెస్టు, రూ.30 వేలు విలువైన నిత్యావసర సురుకులు అందజేశారు. భవిష్యత్తులో వినోద్ కుటుంబాన్ని మరింత ఆదుకుంటానని భరోసా ఇచ్చారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత

రాప్తాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో లభ్యమయ్యే పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత అన్నారు. బుధవారం మండలంలోని వరిమడుగు, ప్రసన్నాయపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఆయా కేంద్రాల్లో అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. తాజా కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు, గుడ్లు, చేపలు, పాలు, తీసుకుంటే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, సరోజ, హెల్పర్స్ పాల్గొన్నారు.

తపాలా శాఖ సూపరింటెండెంట్‌గా గుంపస్వామి

అనంతపురం సిటీ: జిల్లా తపాలా శాఖ సూపరింటెండెంట్‌గా బి.గుంపస్వామి నియమితులయ్యారు. ఈ మేరకు కర్నూలు రేంజ్ పీఎంజీ(అసిస్టెంట్ డైరెక్టర్) ఉత్తర్వులు జారీ చేశారు. తమిళనాడులోని కుంబకోణం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై అనంతపురానికి రానున్నారు. ఇక్కడ పనిచేసిన హరిబాబును శ్రీకాకుళం డివిజన్‌కు బదిలీ చేశారు. అయితే ఎన్నికల విధులు కేటాయించినందున హరిబాబు రిలీవ్ అయ్యేందుకు సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

రంజాన్ శుభాకాంక్షలు

అనంతపురం: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని ముస్లింలకు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ ప్రార్థనలకు మసీదులకు వెళ్లొచ్చే సమయంలో ఏదైనా సమస్య తలెత్తినా, ఇబ్బంది కలిగిన వెంటనే డయల్ 100/112, 9440796800కు సమాచారం చేరవేయాలన్నారు.

ఆకట్టుకున్న పన్నేరపు బండ్ల ప్రదర్శన


సనప గ్రామంలో పన్నేరపు బండ్లను తిప్పుతున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని సనప గ్రామంలో మాధవాజుల జాతర కొనసాగుతోంది. బుధవారం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు ఎద్ల బండ్లను అలంకరించి (పన్నేరపు బండ్లు) ఆలయం చుట్టూ తిప్పారు.

కంపోస్టు యార్డు పరిశీలన

అనంతపురం కార్పొరేషన్: వేసవిలో ఎప్పటికప్పుడు మంటలు అదుపులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని మేయర్ వసీం, కమిషనర్ మేఘస్వరూప్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కంపోస్టు యార్డులో ఫైరింజన్ ద్వారా మంటలను ఆర్పారు. ఈ పనులను అదనపు కమిషనర్ శ్రీహరిబాబు పరిశీలించారు. సిబ్బందితో అప్రమత్తంగా ఉండి, సమాచారం ఇవ్వాలన్నారు.

శవ రాజకీయాలు మానుకోండి

అనంతపురం క్రైం: శవరాజకీయాలు మానుకోవాలని టీడీపీ, జనసేన నాయకులకు ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల సూచించారు. బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నేతలు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కుటిల రాజకీయాలకు ఓ మహిళ బలైందన్నారు. గుంటూరు జిల్లా, తెనాలికి చెందిన గీతాంజలి ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వ్యక్త పరుస్తూ ఇచ్చిన వాయిస్ వీడియో నెట్టింట వైరల్ అయిందన్నారు. దీన్ని కూడా జీర్ణించుకోలేని ఈ రెండు పార్టీల కుట్ర దారులు ట్రోల్‌చేసి ఆమె ప్రాణం తీశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పరమైన అంశాలతో ఖాతాలు తీసి పార్టీలపై నిత్యం దుమ్మెత్తి, అసత్య ప్రచారాలు చేస్తూ అమాయకుల జీవితాలతో చెలగాటమాడే వారి సంఖ్య పెరిగిందన్నారు. ఇలాంటి నీచులపై పోలీసుశాఖ శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత గీతాంజలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థి విభాగం నగరాధ్యక్షుడిగా బాబా సలామ్



అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి చెందిన బాబా సలామ్‌ను అనంతపురం నగర పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది.